సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి

ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయించాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు.

- 8లో▸



సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్ రావు అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0°/25.0°

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ 6:36	బుధ 4:40

న్యూస్‌రీల్

జాతీయస్థాయి ప్రేరణకు ఎంపిక

భూపాలపల్లి అర్బన్: గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి ప్రేరణ కార్యక్రమానికి జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ కేంద్రీయ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని 15 పాఠశాలలకు చెందిన 30మంది విద్యార్థులు పాల్గొనగా ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చగా ఎంపిక చేసినట్లు తెలిపారు. వారం రోజుల పాటు గుజరాత్‌లోని వెర్నాక్యులర్ పాఠశాలలో శిక్షణ పొందనున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చల్లగరిగ గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అటుగా వెళ్తున్న బొలేరో వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. అందులో 20క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ బియ్యం ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారనే విషయం తెలియలేదు. జూకల్ గ్రామానికి చెందిన సొడ కిషన్, బొలేరో వాహన డ్రైవర్ శీలపాక అంజిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక



రేగొండ: హిందూ, ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని భాగిర్తిపేట గ్రామంలో సోమవారం సాయంత్రం ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ముస్లింలకు అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామంలోని కబరస్తాన్ ప్రహరీ నిర్మాణం కోసం రూ.10లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రహీం, మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు రాం నర్సింహరెడ్డి, పున్నం రవి, మేకల భిక్షపతి, పట్టెం శంకర్, వినోద్‌కుమార్, వెంకటస్వామి, శాబీర్ అలీ, రహీం, చోటేమియా, రాజ్‌మహమ్మద్, పాషా, షబ్బీర్ అలీ, హమీద్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మహాముత్తారం: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాజేందర్ అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల కోసం సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, గ్రామ సమైక్య సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ పాఠశాలలను అభివృద్ధి చేయడం కోసం అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవానాయక్, సెక్టోరల్ ఆఫీసర్ రాజగోపాల్, కరుణాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

టీఎంపీఎస్ కమిటీలు రద్దు

వెంకటాపురం(ఎం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ మాల పోరాట సమితి (టీఎంపీఎస్) కమిటీలను రద్దు చేస్తున్నట్లు టీఎంపీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ టీఎంపీఎస్ 2010లో ఆవిర్భవించిందని, ప్రస్తుతం బూత్ కమిటీల నుంచి రాష్ట్ర కమిటీల వరకు రద్దు చేస్తున్నట్లు చెప్పారు.



ఉగాది ఉషస్సులు..

శ్రీక్రోధి నామ సంవత్సర సందడి..

వేపచెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా.. మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా.. మోదుగచెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే రమణీయమైన సొగసుల కాలమే వసంతమే. చైత్ర శుక్ల పాడ్యమి రోజున జరుపుకునే తెలుగువారి తొలి పండుగ ఉగాది. శ్రీక్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని జిల్లాలోని పలు కూడళ్లలో సందడి నెలకొంది. ఉగాది పచ్చడికి అవసరమైన కొత్త కుండలు, చింతపండు, మామిడాకులు, మామిడికాయలు, వేపపూవు కొనుగోలు చేశారు. పండుగ రోజు పంచాంగ శ్రవణానికి ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.

- వివరాలు 8లో▸ - హన్మకొండ కల్చరల్

నేడు పంచాంగ శ్రవణం

కాళేశ్వరం: ఉగాది పండుగను పురస్కరించుకొని కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఈఓ మారుతి తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ప్రత్యేకంగా వేదపండితులతో పంచాంగ శ్రవనం చదివి వినిపించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

15న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: శారీరక, వినికిడి, మానసిక, కంటిచూపు అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు ఈనెల 15న జిల్లాకేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నరేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు స్లాట్ ప్రారంభం అవుతుందని, క్యాంపునకు హాజరు కావాల్సిన వారు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. గతంలో స్లాట్‌బుక్ చేసుకొని రిజక్ట్ అయిన వారు అనర్హులని తెలిపారు.

పనులు పూర్తయ్యేనా..?

రెండు పిల్లర్లు ధ్వంసం..

2018లో అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మంత్రులు టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగుపై రూ.18కోట్లతో వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. దశాబ్దాల కోరిక అయిన టేకుమట్ల నుంచి జమ్మికుంటకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. వాగు అవతలి గ్రామాల ప్రజలకు కూడా మండలకేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బందులు తొలిగిపోయాయి. గతేడాది ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలతో రెండు పిల్లర్లు ధ్వంసమై వంతెన తెగిపోయింది. దీంతో జమ్మికుంట, కరీంనగర్ వెళ్లే ప్రయాణికులకు సమస్య ఏర్పడింది.



వర్షాకాలంలో కూలిపోయిన చలివాగు వంతెన

- తాత్కాలిక బ్రిడ్జి, మట్టిరోడ్డు నిర్మాణం
- రూ.5కోట్ల నిధులు మంజూరు
- పనులు పూర్తికాకుంటే వానాకాలంలో కష్టమే



కొనసాగుతున్న వంతెన పునఃనిర్మాణ పనులు



చలివాగులో నిర్మించిన మట్టి రోడ్డు



పాదాచారులు, ద్విచక్ర వాహనాల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన

టేకుమట్ల: గతేడాది ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగుపై వంతెన కూలిపోయినప్పటి నుంచి వాహనదారులకు కష్టాలు మొదలయ్యాయి. వాగులో నుంచి తాత్కాలికంగా మట్టిరోడ్డు నిర్మాణం చేయడంతో కొంత ఇబ్బందులు తప్పాయి. వంతెన నిర్మాణం కోసం రూ.5కోట్లు నిధులు మంజూరు కాగా ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. అయితే వానాకాలం మరో మూడు నెలలు మాత్రమే ఉండడంతో పనులు పూర్తవుతాయా.. లేక ఈ వర్షాకాలంలో కూడా ఇబ్బందులు తప్పవా అని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తికాకుంటే మాత్రం కరీంనగర్, జమ్మికుంట పట్టణాలకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

తాత్కాలిక సౌకర్యాలు..

చలివాగు వంతెన కూలిపోవడంతో టేకుమట్ల నుంచి జమ్మికుంట చేరుకునేందుకు చిట్యాల, మొగుళ్లపల్లి మీదుగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో సుమారు 20కిలోమీటర్లు అదనంగా ప్రయాణం ఉంటుంది. వ్యాపారుల, ప్రజల కోరిక మేరకు అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాలినడక, ద్విచక్రవాహనాలు వెళ్లేలా తాత్కాలిక వంతెనను అక్టోబర్ నెలలో ఏర్పాటుచేశారు. ఇటీవల ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ భవేష్‌మిశ్రా పర్యటించి రూ.20లక్షలతో వాగులో నుంచి తాత్కాలికంగా మట్టిరోడ్డు నిర్మాణం చేశారు. దీంతో భారీ వాహనాలు సైతం జమ్మికుంటను వెళ్తున్నాయి. అయితే వర్షాలు పడి వాగులో నుంచి నీరువస్తే రాకపోకలు స్తంభిస్తాయి.

ఇటీవలే పనులు ప్రారంభం

వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5కోట్లు నిధులు మంజూరుచేసింది. కాంట్రాక్టర్ ఇటీవలే పనులు ప్రారంభించారు. వానాకాలానికి మూడు నెలల సమయం మాత్రమే ఉండడంతో పనులు అప్పటి వరకు పూర్తవుతాయా అనేది చూడాల్సి ఉంది. ముందస్తుగా వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో మరో సంవత్సరం ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవనున్నాయి. పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డున పడ్డాం..



చలివాగు వంతెన తెగకముందు నిత్యం ప్రయాణికులతో ఉపాధి పొందేవారం. అప్పటి నుంచి పూర్తిగా ఉపాధి కోల్పోయాం. ఎండాకాలంలో పనులు పూర్తయితే వాగు అవతలి గ్రామాలకు ఆటోలు తిప్పుతూ ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. త్వరగా పనులు పూర్తిచేయాలి.

- ఓదెల సంపత్, ఆటోడ్రైవర్, టేకుమట్ల

మేడిగడ్డను మరమ్మతు చేసి సాగునీరు అందించాలి

- సీపీఎం నాయకుల డిమాండ్
- బ్యారేజీ సందర్శన



పియర్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టుకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి సాగునీరందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకరి వీరయ్య అన్నారు. మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని సోమవారం సీపీఎం బృందం సందర్శించింది. పగుళ్లు వచ్చిన 7వ బ్లాక్‌లోని 19, 20, 21 పియర్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ..గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్ట్‌లోనే అత్యధికంగా ఖర్చు చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం అన్నారు. దానిలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం దారుణమన్నారు. దీనిపై న్యాయ విచారణ చేసి నిర్మాణ సంస్థ లోపమా? అప్పటి ప్రభుత్వ డిజైన్స్ లోపమా, ఇంజనీర్ల తప్పిదమా? అనేది గుర్తించి సంబంధిత వ్యక్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ విచారణకు ముందే మరమ్మతులు చేసి సాగునీటిని రైతులకు అందించాలన్నారు. ఇప్పటికే తెలంగాణలో కరువుఛాయలు నెలకొన్నాయన్నారు. వారివెంట కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఇతర నాయకులు సాగర్, సాయిలు ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మధుసూదన్



వైద్యురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

కాటారం: ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ వైద్యులకు సూచించారు. కాటారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల నిల్వ, వైద్యులు, సిబ్బంది పనితీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆస్పత్రిలో ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉంచాలని వైద్యురాలు మౌనికకు సూచించారు. ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశంలో, వరి కొనుగోలు కేంద్రాల వద్దకు ఓఆర్‌ఎస్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి ద్వారా నిరంతరం వైద్యం అందేలా చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ వెంట మండల వైద్యులు మౌనిక, సిబ్బంది ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

రేగొండ(కొత్తపల్లిగోరి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య అధ్యక్షతన సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కృషి చేయాలని అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని భూసమస్యలు పరిష్కరించి, అర్హులకు పట్టాలు అందజేస్తామని తెలిపారు. నూతన మండలంలో కార్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపీగా కావ్యను గెలిపిస్తే రాష్ట్ర నిధులతో పాటు, కేంద్రం నుంచి వచ్చే నిధులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి, పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు సంపత్‌రావు, రాంనర్సింహారెడ్డి, వీరేందర్, పున్నం రవి, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

ఎస్పీ కిరణ్ ఖరే



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: జిల్లాలో మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయడంతో పాటు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మాదక ద్రవ్యాల వలన జరిగే నష్టాల గురించి తెలియజేసే వాల్‌పోస్టర్‌ను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసుశాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. రవాణా, సాగు, వినియోగం నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువతే భావిభారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. దీనిని గుర్తించి డ్రగ్స్‌వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించాలని, జిల్లాలోకి మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా కాకుండా చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు..

బాధితుల ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే జిల్లాలోని పోలీసు అధికారులకు సూచించారు. వివిధ సమస్యలపై వచ్చిన 12 ఫిర్యాదులను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల నుంచి స్వీకరించారు. సివిల్ సమస్యలను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

మహాముత్తారం: సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'కంపుకొడుతోంది' కథనానికి మండల అధికారులు స్పందించారు. మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద ఇరువైపులా చెత్త, మురికినీరును తొలగించారు. ప్రధాన కూడలిలో దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



చెత్తను తొలగిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

తాగునీటి సమస్య రానివ్వొద్దు

- జిల్లా పర్యవేక్షణ ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి
- ఇసుక రీచ్‌ల కోసం ప్రతిపాదనలు పంపాలి
- కలెక్టర్ భవేష్‌మిశ్రా



మాట్లాడుతున్న జిల్లా పర్యవేక్షణాధికారి గోపి

భూపాలపల్లి: వేసవి పూర్తయ్యే వరకు పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి మిషన్ భగీరథ, ఇంట్రా, మున్సిపల్, విద్యుత్, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓ, ఎంపీఓలతో జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. ప్రభుత్వం తాగునీటి సరఫరా పర్యవేక్షణకోసం రాష్ట్రస్థాయి అధికారులను జిల్లాలకు నియమించిందని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం తాగునీటికి ఎంత ప్రాధాన్యతనిస్తుందో మనందరం గమనించాలని అన్నారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలోని ఒక మున్సిపాలిటీ, 241 గ్రామ పంచాయతీలకు భీంఘన్‌పూర్(గొల్లబుద్దారం), రామప్ప, గణపసముద్రం, పంప్‌హౌస్‌ల ద్వారా తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రెండు నెలలు నీరు సరఫరా చేసేందుకు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో సమ్మర్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వివరాలు అందజేయాలి..

రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులు, వాటికి చెల్లించిన బిల్లులు, చెల్లించాల్సిన బిల్లులు, లేబర్ పేమెంట్, మెటీరియల్ పేమెంట్ తదితర వివరాలు వారంలోగా అందచేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లింపు, పెండింగ్, వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు పెంపకం తదితర అంశాలపై ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి..

చిన్నారుల మరణాలు తగ్గించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య, మహిళ, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పుట్టినప్పటి నుండి 28 రోజుల వరకు, 28 రోజుల నుండి సంవత్సరం వరకు, సంవత్సరం పైన చిన్నారులు ఆరోగ్య సమస్యలతో మరణిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మధుసూదన్, మహిళా శిశు సంక్షేమ అధికారి నాగేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు ప్రతిపాదనలు పంపాలి..

నూతనంగా ఇసుక రీచ్ లు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం నుంచి రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రజల అవసరాలకు వినియోగించడానికి స్థానికంగా ఉన్న వనరుల నుంచి ఇసుక తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఇంటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా తహసీల్దార్‌కు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆ ప్రతిపాదనల మేరకు తహసీల్దార్ అనుమతులు జారీ చేయాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే సరిపోతుందన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మైనింగ్ ఏడీ జయరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు..

పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ వసంత ఋతువు అందరి జీవితాలలో నవ వసంతం నింపాలన్నారు.



ఘనంగా విశ్వబ్రాహ్మణుల ఉగాది

విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగ వేడుకకు ముందు అమావాస్య రోజు తీగదారు పూలతో పందిరి ఏర్పాటు చేసి వారి కులదైవం వీరబ్రహ్మేంద్రస్వామిని ప్రతిష్ఠించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగరంలోని పలువురు విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వారి వృత్తి సామగ్రిని మోదుగ పూలుతో అలంకరించి, భక్ష్యాలు, ఉగాది పచ్చడి నివేదన చేశారు.



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

నేడు టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీమద్రామాయణ సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ఏకశిల పార్కులో గల సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వరంగల్‌లోని హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు.

కుజగ్రహం రాజుగా..



ఈ సంవత్సరం కుజగ్రహం రాజుగా ఉండడం జరుగుతోంది. క్రోధి అనే పేరుతో వస్తున్న ఈ కాలం క్రోధ స్వభావం కలిగిన కుజ గ్రహానికి రాజాధిపత్యం వచ్చింది. ఉగాది పండుగ తేదీ 9, వారం మంగళవారం కావడం వల్ల కుజగ్రహం సంపూర్ణంగా బలవంతుడై ఉంటాడు. ఈ సంవత్సరం కఠిన నిర్ణయాలు తీసుకోవడం, న్యాయపర విషయాల్లో గట్టి వైఖరి కలిగి ఉండడం సహజంగా ఏర్పడుతుంది. రాజు కుజుడు కావడంతో ప్రజలు, పాలకుల్లో క్రోధ, ఆవేశాలు పెరగడం, భూసంబంధ వ్యవహారాలు ఉత్పన్నమవుతాయి. రాజకీయాల్లో ఊహించని పరస్పర వ్యతిరేకాలు తారాస్థాయికి చేరుతాయి.

- శివపురం రామలింగ ఆరాధ్య, విశ్రాంత అర్చకులు, కరీమాబాద్, వరంగల్

శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం



బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



హన్మకొండ కల్చరల్ : తెలుగువారి పండుగల్లో యు(ఉ)గాది పండుగ మొట్టమొదటి. పంచాంగం ప్రకారం ప్రతీ ఉగాదికి ఒక్కో పేరు ఉంటుంది.38వది క్రోధి నామ సంవత్సరం. ఇది కోపం కలిగించేది అని చెప్తారు. 'యుగాది'లో యుగం అనగా వయస్సు, ఆది అనగా ప్రారంభమని అర్థం . ఉగాది పండుగ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా ఆనందానికి, సౌభాగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు, పల్లెలలోని జానపదుల జీవనశైలికి సంకేతంగా నిలుస్తోంది. ఉగాది కాలానికి సంబంధించిన పండుగ. వేప చెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా మోదుగ చెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే వసంతకాలంలో రమణీయమైన సొగసులతో అలరారే చైత్రమాసం ప్రారంభమవుతుంది. చైత్ర శుక్ల పాడ్యమి రోజున ప్రతియేటా ఈ పండుగను జరుపుకుంటారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో కొత్తకుండలు, మోదుగు పూలు, కొత్తచింతపండు, మామిడాకులు, కాయలు, వేప పూలు, చామంతి, గులాబీ, బంతి పూలు, గులాలు, పసుపు, కుంకుమ, గుగ్గిలం తదితర పూజా సామగ్రి అమ్మకాలు సాగాయి.

ఉగాది పచ్చడి ప్రత్యేకత..

ఆయా కాలాల్లో పండించిన వాటిని పండుగల సందర్భంగా దేవుడికి నివేదించిన అనంతరం స్వీకరిస్తాం. చైత్రమాసంలో లభించే చింతపండు, బెల్లం , మామిడి పిందెలు, వేపపూతను కొత్తకుండలో వేసి పచ్చడిగా చేసి భగవత్ నివేదనలుగా సమర్పిస్తారు. తెలంగాణలో ఉగాది పచ్చడిని పానీయంలాగే చేయడం సాంప్రదాయం. దీన్ని షడ్రుచుల సమ్మేళనంగా భావిస్తారు. నిజానికి ఉగాది ప్రారంభంలో మిరపకాయలు లేవు పూర్వం మిర్యాలు వాడేవారు. ఉగాది పచ్చడిలో కొందరు మిర్యాల పొడి వేయడానికి, ఉల్లిగడ్డ ముక్కలు వేయడానికి అదే కారణం. ఉప్పు కూడా కొద్దిగా వేస్తారు. ఉగాది పండుగరోజు దేవుడికి సమర్పించే నివేదనలలో కొత్తబెల్లం, కొత్త శనిగ పప్పు ఉడికించి చేసే భక్ష్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉగాది పచ్చడి ఎన్నో ఔషధ గుణాలతో కలిగి ఉంటుంది. ముఖ్యంగా కచ్చమామిడి కాయ, చింతపండు, బెల్లం శరీరంలోని రుగ్మతలను తట్టుకునే శక్తి ఉందని శాస్త్రీయంగా నిరూపితమైంది. వేప పువ్వును పచ్చడిలో వాడటం ప్రత్యేకత. బెల్లంను నేరుగా తింటే శరీరానికి వేడి చేస్తుంది. పానీయంగా వాడితే ఎండనుంచి రక్షించుకోవచ్చు.

38వ తెలుగు సంవత్సరం.. 60 తెలుగు సంవత్సరాలలో 38వది క్రోధినామ సంవత్సరం. ఇది కోపానికి సూచిక.. నేడు కొంగొత్త శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదినం నిర్వహిస్తారు.

ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి




సింపోజియంలో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, పాల్గొన్న అధ్యాపకులు

- హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యానికి గురైంది
- వర్సిటీల్లో అధ్యాపకుల కొరత.. నిధులు కేటాయింపు తక్కువ
- ఉన్నతవిద్యలో ప్రతికూల ప్రభావం
- కేయూలో కుర్తా సింపోజియంలో వక్తలు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు, బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించాలి. రాష్ట్రంలో గత దశాబ్ద కాలం పాటుగా వర్సిటీల్లోని ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని అధ్యాపకుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలపైన ప్రతికూల ప్రభావం చూపిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వర్సిటీల్లోనూ, డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రధానంగా విద్యార్థినుల (అమ్మాయిలు) సంఖ్య బాగా పెరిగిందని అందుకనుగుణంగా వారికి కూడా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంపై పాలకవర్గాలు విద్యా విధానాలు రూపొందించడంలోనూ అంతగా పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోను బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తున్నారన్నారు. విద్యారంగాభివృద్ధికి గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది స్పష్టం అవుతోందని వారు అభిప్రాయపడ్డారు. కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో నిర్వహించిన సెనేట్ హాల్‌లో రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితులు, బలోపేతం అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సింపోజియంనకు కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానందం అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ ఆచార్య వడ్డె రవీందర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి, రిటైర్డ్ ఆచార్యులు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడారు. ఈ సింపోజియంలో వచ్చిన అభిప్రాయాలపరంగా సూచనలు, సలహాలతో డాక్యుమెంట్ల రూపేణ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కుర్తా అధ్యక్షుడు సదానందం తెలిపారు.

చదివించినప్పుడే ప్రశ్నించే అవకాశం

వ్యక్తిగా తాను సొంతంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో డబ్బులు పెట్టి చదువుకుంటారు. వారు ఉన్నత విద్యను పూర్తి చేశాక తాము డబ్బులు సంపాదించేందుకే మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది. ప్రభుత్వపరంగా విద్యను అందిస్తే సమాజం తనను చదివించింది అనే భావనతో విద్యను పూర్తిచేసిన వ్యక్తుల్లో సేవాభావం ఉంటుంది. అంతేగాకుండా సమాజం కూడా నైతికంగా ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విద్య పటిష్టానికి సమాజంలోకి వెళ్లి సామాజికంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

- హరగోపాల్, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్

సింపోజియంతో కనువిప్పు కలగాలి



సమాజంలో విద్యావ్యవస్థ కీలకమైంది. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం. ఆల్‌ఇండియా ఎడ్యుకేషన్ సర్వే రిపోర్టు చూస్తే భారత దేశంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 28.4 శాతం ఉంటే తెలంగాణలో 40 శాతం వరకు ఉంది. ఇలాంటి సింపోజియం డిబేట్‌ల ద్వారా విద్యారంగ అభివృద్ధికి పలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి.

- ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

సరైన విద్యా విధానం లేదు



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికి సరైన విద్యా విధానం లేదు. వివిధ ప్రభుత్వాల హయాంలో ఇప్పటి వరకు కోఠారి కమిషన్‌తో పాటు వివిధ కమిషన్లు వేశారు. నూతన జాతీయ విద్యావిధానం–2020 అని అంటున్నారు. కానీ నేటికి సరైన నిర్దిష్టమైన విద్యావిధానాన్ని రూపకల్పన చేయలేకపోయారు. కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తోంది.

- తాటికొండ రమేష్, కేయూ, వీసీ

గతంలో వర్సిటీలకు నిధులు ఇచ్చాం

తాను యూజీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు దేశంలో యూనివర్సిటీలకు రీసెర్చ్‌పర్పస్‌లో వివిధ ఫెలోషిప్స్ ఇచ్చాం. పరిశోధన పరంగా నిధులిచ్చి ప్రోత్సహించాం. తొలుత ఆయన జూమ్ మీటింగ్‌లో న్యూఢిల్లీ నుంచి కొద్ది సేపు మాట్లాడారు. గత పదేళ్లుగా యూజీసీకి నిధులు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగంలో నాణ్యమైన విద్య తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

- సుఖ్‌దేవ్‌తోరెట్, యూజీసీ మాజీ చైర్మన్

నాణ్యమైన విద్య అందించాలి



ఇంజనీరింగ్ విద్యలోనూ నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో ప్రతి ఏడాది బయటికి వస్తున్న వారిలో 30 శాతంమందికి ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ ఉద్యోగ అర్హతలు ఉండటం లేదు. తాను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాను. తాను సోమవారం ఆ కళాశాలను సందర్శించి చూశాను. రెగ్యులర్ ఫ్యాకల్టీ కొందరే ఉన్నారు. దీంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

- డాక్టర్ మోహన్‌రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్

మార్పునకు విద్య ఒక సాధనం



సామాజిక మార్పునకు విద్య ఒక సాధనం. విద్యార్థులు చదువుకోవాలని ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా సదుపాయాలు లేవు. ప్రభుత్వం టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలి. సంపూర్ణంగా అంతర్గతంగా పనిచేసే వాతావరణం కల్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్య రంగాభివృద్ధికి తగినంత నిధులు వర్సిటీలకు కేటాయించాల్సి ఉంటుంది.

- కోదండరామ్, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

- సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

కేయూ క్యాంపస్ : నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సైన్స్‌పై విద్యార్థులు ఎక్కువగా ఆసక్తిని పెంపొందించుకోవాలని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగం అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిజనిర్ధారణ కోసం సైన్స్‌ను ఆశ్రయిస్తారన్నారు. ముఖ్యంగా డీఎన్‌ఏ పరిశోధనతో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. రాజకీయ నాయకులు తమ పదవీకాలం ముగియగానే సమాజంలో తెగతెంపులు అవుతాయన్నారు. కానీ శాస్త్రవేత్తకు నిరంతరం పరిశోధనల అనుసంధానం ఉంటుందన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. అధ్యాపకులు తమకున్న అవకాశాలను అందిపుచ్చుకొనే విధంగా తరగతి గది పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోధన, పరిశోధన నిరంతర ప్రక్రియ అన్నారు. కొంతమందికి అవకాశాలు రావడంతో వారి సేవలు సమాజానికి వివిధ రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ.. మానవాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, అధ్యాపకుడు డాక్టర్ ఆదిరెడ్డి, సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ మోహన్‌రావు ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆయన కళాశాలను సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

- **3 BHK, Near: L.B.Nagar Muncipal Park, 1st Floor, Lift Facility available. L.B.Nagar, Warangal. Cell: 9866042155.** [W-1264926]

PLOT FOR SALE

- మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు రిశాల చౌరస్తా నుండి మరియు జ్యోతిబాపులే అక్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికి 9032111600. [W-1264875]

WANTED

- **Govt (Regd) సంస్థ తరఫున Work** చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-1264916]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185024]

- **Hydలోని పేషెంట్లను, ముసలివారిని, వారి ఇంటి** వద్దనే చూసుకొనుటకు ఆయాలు, వార్డ్ బాయ్స్, నర్సులు, కేర్‌టేకర్స్ కా॥. జీ : 10-25 వేలు. రూం + భో॥ ఫ్రీ. Ph: 9000638842, 9866605144 [HA-13644]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.